ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్



అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి : కలెక్టర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఇన్‌చార్జ్ డీఆర్వో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి పొందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు.

ప్రజల నుంచి అందిన అర్జీల్లో కొన్ని..

చెన్నూరు మండలానికి చెందిన బి.గ్రేసమ్మ తన ఇంటిస్థలాన్ని ఇతరులు ఆక్రమించారని న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఎర్రగుంట్ల మండలం కలమల గ్రామానికి చెందిన బి.వెంకటరమణారెడ్డి సర్వేనెంబర్ 55లో 8.35 సెంట్ల భూమిని 22ఏ నుంచి రద్దు చేయాలని విన్నవించారు. ఒంటిమిట్ట మండలం సాలాబాదుకు చెందిన శ్రీనివాసులు తన కుమార్తె టీసీలో బలిజ కులమని నమోదు చేయాలని వినతిపత్రం అందించారు. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరుకు చెందిన ఓబులమ్మ తన ఆధీనంలో ఉన్న భూమి రోడ్డు విస్తరణలో పోయిందని నష్టపరిహారం చెల్లించాలని మనవి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాల్లో అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సర్వీసు చార్జీలు మాత్రమే తీసుకోవాలని అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని డాక్టర్ చెరుకూరి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆధార్ సేవల నిర్వహణపై సోమవారం జేసీ అదితిసింగ్, అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, జిల్లాలోని పలు ఆధార్ సేవ కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధార్ సేవా కేంద్రాల్లో ఆపరేటర్ సేవలు అందించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఆధార్ నమోదు కేంద్రాల్లో ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ కోసం వచ్చే ప్రజలు తమ వెంట సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని వస్తే స్కాన్ చేసి వాటిని తిరిగి ఇస్తారని, జిరాక్స్‌కాపీలు అవసరంలేదని తెలిపారు. ఆధార్ నమోదుతో పాటు వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ సేవలు ఉచితం అని వివరించారు. ఆధార్ ఆపరేటర్లు మిగతా సేవల కోసం ప్రభుత్వం నిర్ణయించిన సర్వీసు చార్జీల కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తే కలెక్టరేట్‌లోని జిల్లా కంట్రోల్ రూము నెంబర్ 08562-246344కు కాల్ చేయాలని సూచించారు.

ముందస్తు పరీక్షతో క్యాన్సర్ నుంచి రక్ష

ముందస్తు పరీక్ష క్యాన్సర్ నుంచి రక్ష అని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 14వతేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటిలో సర్వే చేస్తారని 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ, పురుషులకు షుగరు, బీపీ, రక్తపరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో జేసీ అదితిసింగ్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసరు డాక్టర్ రమేశ్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీఈవో, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ హిమదేవి, డీఎంతో శాఖ అధికారులు పాల్గొన్నారు.

పుష్పగిరిని దర్శించిన జిల్లా ప్రధాన జడ్జి

వల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరిని కార్తీక సోమవారం సందర్భంగా జిల్లా ప్రధానజడ్జి శ్రీదేవి కుటుంబ సభ్యులతో కలసి సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. కొండపై గల రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవుని ఆలయ అర్చకులు జడ్జికి స్వాగతం పలికారు. అనంతరం సంతాన మల్లేశ్వరుడుకి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు అర్చకులు వేదాశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పుష్పగిరి క్షేత్రం దర్శించుకోవడం అందులో కార్తీక సోమవారం తమకెంతో సంతోషం కలిగించిందన్నారు. తమ స్వహస్తాలతో సంతాన మల్లేశ్వరుడికి అభిషేకం చేయడం పుణ్యదాయకమని అన్నారు.




సంతాన మల్లేశ్వరుడికి అభిషేకం చేస్తున్న జడ్జి

బడ్జెట్ భళా





ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం నాలుగు నెలల బడ్జెట్‌ను సోమవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన ప్రవేశపెట్టింది. ఇప్పుడు పెట్టిన బడ్జెట్ వచ్చే మార్చి నెల చివరి నాటికి ముగిసిపోతున్నప్పటికీ.. బడ్జెట్‌లో కేటాయింపులు భళా అనిపిస్తున్నాయి.



- నీటిపారుదల రంగానికి భారీ కేటాయింపులు
- వైవీయూ, వైఎస్సార్ ఆర్కిటెక్‌కు నిధుల కేటాయింపు
- పట్టణాల్లో అమృత్-2 పథకం అమలు

(కడప-ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు వచ్చిన ఐదేళ్ల అవకాశాన్ని సొంత జిల్లాను అద్భుతంగా అభివృద్ధి చేసేందుకు ఉపయోగించుకోలేదు. ఏదో పులివెందులలో నాలుగురాళ్లు.. తారురోడ్లు లైట్లు వేయడం.. కడపలో రెండురోడ్లు డెవలప్ చేసి వదిలేస్తే ఇదే అభివృద్ధి అనుకున్నారు. అభివృద్ధి అంటే నిరుద్యోగ యువకులకు పరిశ్రమలు, రైతన్నల కోసం ప్రాజెక్టులు పూర్తిచేయడం.. భావిభారత పౌరులను తయారు చేయాల్సిన విద్యాలయాలను అభివృద్ధి చేయడం.. ఇక తాగునీరు రోడ్లు, రహదారులు ఇవన్నీ ఉండాలి. జగన్ ఐదేళ్ల అధికారంలో ఉన్నా ప్రధానమైన సాగునీటి ప్రాజెక్టులు ఒక్కటీ పూర్తి కాలేదు. యూనివర్శిటీల అభివృద్ధి అంతంతే. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు బాగున్నాయి.

ఆర్థిక సంవత్సరం ముగింపునకు గడువు చాలా తక్కువ ఉన్నప్పటికీ బడ్జెట్ కేటాయింపుల్లో మాజీ సీఎం సొంతజిల్లాకు ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాకు కీలకమైన ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు. మైలవరం ప్రాజెక్టుకు కాల్వల మెయింటెనెన్స్, రిపేర్లు నిర్వహణ ఉద్యోగుల జీతభత్యాలకు రూ.4.4 కోట్లు కేటాయించారు. ఇక గాలేరు నగరి ప్రాజెక్టులకు సంబంధించి పనులు, జీతాలు ఇతరనిర్వహణ కోసం రూ.139 కోట్లు, పీబీసీకి కూడా పనులు, నిర్వహణకు రూ.128.72 కోట్లు, వెలిగల్లు ప్రాజెక్టుకు రూ.14.8 కోట్లు కేటాయించారు. అలాగే తెలుగుగంగకు రూ.305 కోట్లు కేటాయించారు. ఇక వైవీయూకు రూ.40 కోట్లు, వైఎస్సార్ ఆర్కిటెక్ యూనివర్శిటీకి రూ.11 కోట్లు కేటాయించారు.

వీటితో పాటు సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇక జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడ రహదారులు ఆరు వరుసలుగా మారుస్తున్నామని ఇవన్నీ పురోగతిలో ఉన్నట్లు పయ్యావుల కేశవ్ చెప్పుకొచ్చారు. ఇక జగన్ హయాంలో కార్పొరేషన్, మున్సిపాలిటీలు తీవ్ర నిరాశకు గురయ్యాయి. 50వేల నుంచి లక్ష వరకు జనాభా ఉన్న ద్వితీయ శ్రేణి పట్టణాలకు భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఆధారిత బృహత్తర ప్రణాళికలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమృత్ 2.0 ద్వారా నీటి సంరక్షణ పనులు, నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించుకోవడం, వర్షం నీటిని ఒడిసి పట్టడంతో పాటు ప్రజలందరికీ సురక్షిత నీటిని సరఫరా చేయనున్నారు. ఈ స్కీం జిల్లాలో బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు మరికొన్ని చోట్ల అందుబాటులోకి రానుంది.

2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఈవై) ఎన్టీఆర్ నగరాలు పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇళ్లు నిర్మించనున్నారు. 25లక్షల ఇళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జిల్లాలో చాలా వరకు పేదలకు ఇళ్లు లేవు. అద్దె కుటుంబాల్లో ఉన్నారు. జగన్ హయాంలో ఇళ్లు మంజూరు చేసినా ఆ నిధులు బాత్‌రూము కట్టుకునేందుకు కూడా సరిపోవు. ఈ నేపథ్యంలో పీఎంవై ఇళ్లు మంజూరు పేదలకు వరంగా మారనుంది.

దార్శనిక బడ్జెట్ : శ్రీనివాసరెడ్డి



కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దార్శనికంగా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత లోపభూయిష్ట ఆర్థిక విధానాల ద్వారా రాష్ట్ర ఆదాయానికి గండి పడిందని తెలిపారు. రాబోవు 25 సంవత్సరాలు భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టుపెట్టడంతో పాటు స్థానిక సంస్థల నిధులను సైతం దారి మళ్లించారని ఆరోపించారు. ప్రస్తుతం టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 సంవత్సర పూర్తిస్థాయి బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధి పట్ల చంద్రబాబుకు ఉన్న దూరదృష్టి, అనుకూల దృక్పథం స్పష్టంగా తెలుస్తోందని పేర్కొన్నారు.

సీఎం కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టింగ్

- కడప వాసిపై కేసు నమోదు

విజయవాడ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. కడపకు చెందిన పర్వత సుధాకర్‌రెడ్డి సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని ఇష్టానుసారంగా పోస్టింగ్‌లు పెడుతున్నాడు. దీనిపై పటమటకు చెందిన షేక్ నజీర్ అనే టీడీపీ కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

తేలనున్న పశువుల లెక్క

- వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన సర్వే
- నిధులు, పథకాల రూపకల్పనకు అవకాశం

7



అసెంబ్లీకి వెళ్లకపోతే.. వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

- తులసిరెడ్డి డిమాండ్

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లొద్దని నిర్ణయించుకోవడం వారి మూర్ఖత్వానికి, అవివేకానికి నిదర్శనమని.. వెళ్లలేనప్పుడు శాసన సభ్యత్వాలకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందుల శాసనసభ్యులుగా ఉన్నారని, ఆయనతో పాటు ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలను బహిష్కరిస్తున్నామని చెప్పడం ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కడమేనని అన్నారు. వైఎస్ జగన్‌కు ప్రతిపక్షనాయకుడి హోదా ఇవ్వాలంటే వైసీపీకి 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలన్నారు. 11 మందే ఉన్నందున ప్రతిపక్షహోదా రాదన్న విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. తెలిసి కూడా ప్రతిపక్ష హోదా ఇవ్వాలని జగన్ అడగడం అవివేకమన్నారు. అసెంబ్లీకి వెళ్లని పక్షంలో శాసనసభ్యత్వాలకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

బడ్జెట్‌కు విశ్వసనీయత లేదు

పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విశ్వసనీయత లేదని తులసిరెడ్డి అన్నారు. ఉత్తరకుమార ప్రగల్భాలు మాత్రమే చెప్పాడన్నారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం రూ.1.48లక్షల కోట్లు అని, ఖర్చు మాత్రం రూ.2.94లక్షల కోట్లు అని చెబుతున్నారు. మిగతా డబ్బు ఎక్కడ నుంచి తెస్తారు, అప్పు తెస్తారా, నిబంధనలు ఉల్లంఘించి తెస్తారా అని ప్రశ్నించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి కృషిచేశారన్నారు.

ఎంపీ అవినాశ్‌రెడ్డి పీఏపై కేసు నమోదు

- సోషల్ మీడియా కన్వీనర్‌పైనా కేసు
- వీరిద్దరికోసం పోలీసుల ముమ్మర గాలింపు

పులివెందుల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డి, జిల్లా వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వివేకానందరెడ్డిపై పులివెందుల పోలీసుస్టేషన్‌లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో వీరిని అరెస్టు చేసేందుకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సింహాద్రిపురం మండల కేంద్రంలో నివసించే పుల్లప్పగారి హరిని పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద దూషించారన్న ఫిర్యాదు మేరకు వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే వర్రా రవీంద్రరెడ్డి, వైఎస్ కుటుంబ సమీప బంధువు అర్జున్‌రెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డిల మీద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే వర్రాను పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి బండి రాఘవరెడ్డిని, లింగాల మండలం పెద్దకుడాల గ్రామానికి చెందిన వివేకానందరెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. వీరిపైనే కాకుండా మరికొంత మీద కూడా కేసు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. మొత్తం సోషల్ మీడియా ద్వారా వైసీపీ తరపున యాక్టివ్‌గా పనిచేసినవారందరిపైనా కేసులు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేసులు నమోదు చేయకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర హైకోర్టులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేయనున్నారని సమాచారం.



ఎంపీ పీఏ రాఘవరెడ్డి



వివేకానందరెడ్డి

వైసీపీ సోషల్ మీడియా పోస్టులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫొటోలు రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన ఒక పోస్టరులో పెట్టి సోషల్ మీడియా వేదికగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశారంటూ 5వవార్డు టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లకు ఈ రేషన్ బియ్యం అక్రమ సరఫరాలో హస్తం ఉందని ఆ పోస్టరులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ వ్యక్తి గత గౌరవానికి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా వైసీపీ సోషల్ మీడియా ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీ వారి సోషల్ మీడియాలోని అవాస్తవ అవమానకరమైన పోస్టులపై చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ కౌన్సిలర్ ఫిర్యాదు మేరకు క్రైంనెంబరు 307 /2024 అండర్‌సెక్షన్ 353(2) బీఎన్‌ఎస్ చట్టం ప్రకారం త్రీటౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు. కాగా.. వైసీపీ సోషల్ మీడియాలో కీలకంగా పనిచేస్తూ టీడీపీ నేతలపై దారుణమైన పోస్టులు పెట్టిన వర్రా రవీంద్రరెడ్డిపై మూడు రోజుల క్రితమే ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయినట్లు సమాచారం. కానీ ఈ విషయం పోలీసులు అధికారికంగా వెల్లడించడం లేదు. ఈ కేసు నమోదుపై వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆయన సరైన సమాధానం చెప్పలేదు.





బద్వేలులో ఉద్రిక్తత..

- స్థల వివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ
- స్థానికులపై స్థానికేతరులు దౌర్జన్యం
- రూ.కోట్ల విలువచేసే స్థలం మాదంటే మాదంటూ బాహాబాహి...
- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ



భూ వివాదంలో ఘర్షణ పడుతున్న దృశ్యం

బద్వేలుటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో మడకలవారిపల్లె పంచాయతీ సర్వేనెంబర్ 809లో 5.07ఎకరాల భూమి తమదంటూ జమ్మలమడుగుకు చెందిన కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ తీసుకువచ్చి కంపచెట్లను తొలగించి పనులు మొదలుపెట్టారు. ఇది తెలుసుకున్న స్థానికంగా ఉన్న కొందరు అక్కడికి చేరుకుని ఆ భూములు తాము కొన్నామని, తమ పేరుతో రిజిస్ట్రేషన్ ఉందని చెప్పారు. అయినా వారు వినకుండా ఎక్స్‌కవేటర్‌తో దౌర్జన్యంగా చదునుచేసేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసుల రంగప్రవేశంతో ఘర్షణ సర్దుమణిగింది. వివరాలిలా..

కాగా.. 809 సర్వేనెంబర్‌లో 2.5 ఎకరాల భూమి నూనె రాజేశ్వరిపేరుతో ఆన్‌లైన్‌లో ఉందని, వారి వద్ద నుంచి కొనుగోలు చేశామని, వాటి ఆధారంతో ఈ భూమిలో పనులు ప్రారంభించేందుకు వచ్చామని జమ్మలమడుగు, కమలాపురానికి చెందిన వారు చెప్పారు. నాటి తహశీల్దారు మామూళ్లు తీసుకుని నూనె రాజేశ్వరి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించడంతో అప్పట్లోనే ఘర్షణ నెలకొంది. తరువాత అసలైన హక్కుదారులు కలెక్టర్‌ను ఆశ్రయించి ఆన్‌లైన్‌లో నమోదు అయిన పేరును రద్దుచేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ పరిశీలించి సిఫారసు చేయడంతో అప్పటి నుంచి ఆ భూమిలో వివాదం రాలేదు. లబ్ధిదారులు క్రయవిక్రయాలు జరుపుకుంటూ వచ్చారు. ఊహించని విధంగా సోమవారం జమ్మలమడుగు, కమలాపురానికి చెందిన కొందరు వ్యక్తులు రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. మాది జమ్మలమడుగు. మేము ఆదినారాయణరెడ్డి మనుషులం. ఈ భూమి మాది అంటూ.. కొంతమంది ఆదినారాయణరెడ్డి పేరుచెప్పి హల్‌చల్ చేశారు. దాదాపు 10వాహనాల్లో సుమారు 100మంది వ్యక్తులు పథకం ప్రకారం సినీ ఫక్కీలో దౌర్జన్యానికి దిగారు. లబ్ధిదారులు అడ్డుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో.. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. పోలీసులు కాగితాలను పరిశీలించి రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఘర్షణకు కారణమైన భూమి



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న లబ్ధిదారులు

హరికథ చెబుతున్న రమణయ్య భాగవతార్



హరికథే.. జీవనం

- దేశవ్యాప్తంగా 10,623 సార్లు హరికథాగానం
- హరికథకు జీవం పోస్తున్న యడవల్లి రమణయ్య భాగవతార్

6

దేశసేవ లక్ష్యంగా.. పరుగు

- రెండోరోజూ కొనసాగిన ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ

7



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఆర్మీ అధికారి

హరికథే.. జీవనం

● దేశవ్యాప్తంగా 10,623 సార్లు హరికథాగానం ● హరికథకు జీవం పోస్తున్న యడవల్లి రమణయ్య భాగవతార్

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆయన హరికథ చెబితే షైమరచి పోవాల్సిందే. మధ్య మధ్యలో ఆయన చెప్పే పిట్టకథలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయి. 40 ఏళ్లుగా పదివేల సార్లకు పైగా హరికథాగానం చేశారు.. ఆయనే యడవల్లి రమణయ్య భాగవతార్. హరికథతోపాటు ఇతర కళలు నేర్చుకుని బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. రమణయ్య తండ్రి చిన్న కుళాయప్ప పగటి వేషాలు వేసేవారు. కుటుంబ పోషణకోసం కర్నూలు జిల్లా నందికొట్కూరు నుంచి దువ్వూరు మండలం మీర్జాన్‌పల్లెకు చేరుకున్నారు. చిన్నకుళాయప్పకు ఆరుగురు సంతానం కాగా రమణయ్య భాగవతార్ మూడవవారు. మూడవ తరగతి వరకే చదివిన ఆయన ఏడేళ్ల వయస్సులోనే కొండపల్లి దుర్గయ్య వద్ద సంగీతం నేర్చుకున్నారు. సినిమా పాటలు పాడుకుంటూ ఉండేవారు.



హరికథ చెబుతున్న రమణయ్య భాగవతార్ (ఫైల్)

బహుముఖ ప్రజ్ఞాశాలి

తండ్రితోపాటు తన సోదరులు కళాకారులు కావడంతో రమణయ్యకు ఇతర కళలు త్వరగానే వంటబట్టాయి. యక్షగానం, వీధి నాటకాలు, చిన్న వయస్సులోనే ప్రదర్శించేవారు. నాటకాల్లో రామాంజనేయ యుద్ధంలో రాముడు, తులాభారంలో శ్రీకృష్ణుడు, గయోపాఖ్యానంలో శ్రీకృష్ణుడు వేషాలు వేసి నాటకాలను రక్తి కట్టించారు. వీధి నాటకాల్లో అర్ధనారీశ్వరుడు, రుక్మిణి, సత్యభామ, ద్రౌపతి, రంభ వేషధారణతో ఆకట్టుకున్నారు. వీధిభాగవతం ఆడేవారు. అలాగే తబల, హార్మోనియం వాయించేవారు.

హరికథ నేర్చుకుని..

రమణయ్యకు పాక్షికంగా అంగవైకల్యం ఉంది. ఆయన నాటకాలు, వీధి నాటకాల్లో రాణిస్తున్నా బంధువులు ఎగతాళి చేశారు. దీంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆయన పట్టుబట్టి నీలకంఠం భాగవతార్ వద్ద 1981లో హరికథ నేర్చుకున్నారు. ఆ తర్వాత మచిలీపట్నం తరగటూరు ఆంజనేయులు దాసు వద్ద హరికథలో మరిన్ని మెలకువలు నేర్చుకున్నారు. 1982 నుంచి ఆలిండియా రేడియోలో హరికథలు చెబుతున్నారు. సతీతులసి, జలంధర, భూకైలాస్, భక్తమార్కండేయ, గజేంద్రమోక్షం, భక్తమయూర ద్వయం, భక్తచంద్రహాస, పద్మవ్యూహం, నర్తనశాల, ఉత్తరగోగ్రహణం, శ్రీకృష్ణ రాయబారం, ధర్మరాజు అశ్వమేథయాగం, శ్రీనివాస కల్యాణం, సీతారామ కల్యాణం, శ్రీరామ జననం, భక్త అన్నమయ్య, మహాభక్త రామవిజయం హరికథలు చెప్పడంతో ప్రసిద్ధి చెందారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో తిరిగి హరికథలు చెబుతూ హరికథకు ప్రాణం పోస్తున్నారు. 12 ఏళ్ల వయస్సులో హరికథను చెప్పడం ప్రారంభించి 42 సంవత్సరాలుగా హరికథే శ్వాస, ధ్యాసగా జీవిస్తున్నారు. ఇప్పటి వరకు 10,623 సార్లు హరికథ చెప్పారు. హరికథ ద్వారా వచ్చే చదివింపులను వివిధ ఆలయాలకు విరాళంగా అందజేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో దాతల సహకారంతో ఆలయాలను నిర్మించడానికి, పాడుబడిన ఆలయాలను పునర్నిర్మించడానికి కృషి చేశారు.

సత్కారాలు ఎన్నో..

రమణయ్య హరికథకు మెచ్చి సత్కరించిన ప్రముఖులు ఎందరో ఉన్నారు. ఆయన పొందిన అవార్డులు, రివార్డులు, సత్కారాలు ఎన్నో. మైసూరు గణపతి సచ్చినందస్వామి, మైసూరు విజయేంద్ర సరస్వతి, మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆలయ పీఠాధిపతి, సుబుదేంద్రస్వామి వంటి ప్రముఖులతో సత్కారాలు పొందారు. ఆయన హరికథ ప్రతిభను గుర్తించి ఢిల్లీలోని మనం ఫౌండేషన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కళాకారులు బాధలు తెలిసిన రమణయ్య భాగవతార్ సాటి కళాకారులను ప్రోత్సహించడానికి అన్నమయ్య కళాపీఠం స్థాపించి సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సహకారంతో దాదాపు వెయ్యిమంది కళాకారులను ఘనంగా సత్కరించారు. 50 మంది పేద జంటలకు వివాహాలు చేశారు. హరికథను బతికించడానికి ముగ్గురు మహిళలకు హరికథ నేర్పించారు. అన్నమయ్య కళాపీఠం ద్వారా అన్నమయ్య సంకీర్తనలు నేర్పించారు.



కళలను ప్రభుత్వం ఆదరించాలి

- రమణయ్య భాగవతార్

నాడు ప్రజలను చైతన్యం చేసి దశ, దిశ చూపిన కళలు నేడు ఆదరణ లేక కనుమరుగు అవుతున్నాయి. ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి. క్రీడలను ప్రోత్సహించినట్లుగానే కళలను ప్రోత్సహించాలి. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగానే మన రాష్ట్ర ప్రభుత్వం పథకాల ప్రచారానికి కళాకారులను ఉపయోగించుకుని వేతనాలు చెల్లించాలి. కళలు అంతరించిపోకుండా ప్రాచీన కళలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా బోధించాలి.

ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్



నియామకపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని వివిధ కేజీబీవీ పాఠశాలలు, మోడల్ పాఠశాలలకు నూతనంగా ఎంపికైన సీఆర్‌టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు నియామకపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని, వారి కృషి, ప్రోత్సాహం ద్వారా యువత సరైన మార్గంలో నడుస్తుందని తెలిపారు. జిల్లాలో నూతనంగా ఎంపికైన సీఆర్టీలు, ప్రధానోపాధ్యాయులు, పార్ట్‌టైం ఉపాధ్యాయులు మొత్తం 30 మంది ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అవగాహన సదస్సు

మదనపల్లె టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ నేర పరిశోధన విభాగం (సీఐడీ) ఆధ్వర్యంలో బుధవారం మదనపల్లెలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు తిరుపతి సీఐడీ డీఎస్పీ పద్మలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ సదస్సుకు ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.

కురబలకోటలో సైకో వీరంగం

● చిన్నారులపై దాడి
● దేహశుద్ధి చేసిన స్థానికులు




పోలీసు జీపును అడ్డుకుంటున్న గ్రామస్తులు, పోలీసుల అదుపులో నరసింహారెడ్డి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అభం..శుభం తెలియని చిన్నారులపై సైకో వీరంగం చేసి గాయపరిచిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు... మండలంలోని ఎస్సీ కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులపై సైకోగా మారిన మతిస్థిమితం లేని వ్యక్తి దాడి చేశాడు. పాఠశాలలో చదువుతున్న చిన్నారులు మూత్ర విసర్జన చేయడానికి స్కూల్ నుంచి బయటకు వచ్చిన రెండో తరగతి చదువుతున్న విద్యార్థినపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో గట్టిగా కేకలు వేయడంతో మరో నలుగురు చిన్నారులు అక్కడికి వెళ్లగా వారిపైనా దాడి చేయడంతో స్వల్పంగా గాయపడ్డారు. దీంతో సైకో అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు చిన్నారులను వెంటబెట్టుకుని వెళ్లి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఇతను తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ కొప్పలవారిపల్లెకు చెందిన నరసింహారెడ్డిగా గుర్తించారు. కాగా వారం రోజులుగా గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులు పెట్టే భోజనం తింటూ ఉండేవాడు. రాత్రివేళలో గ్రామ సమీపంలో నిద్రించేవాడు. ఈ క్రమంలో చిన్నారులపై దాడి చేసి గాయపరచడంతో కోపోద్రిక్తులై అతడిని దేహశుద్ధి చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు




ప్రథమస్థానం సాధించిన శ్రీకాకుళం జట్టుతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బృందం, రెండో స్థానం సాధించిన కడప జిల్లా జట్టు

● విజేతగా నిలిచిన శ్రీకాకుళం, కడప జట్టు ద్వితీయ స్థానం

రైల్వేకోడూరు (రూరల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మండలంలోని బుడుగుంటపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అండర్-19 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలలో శ్రీకాకుళం జిల్లా ప్రథమ బహుమతి సాధించిందని కడప జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.శారద తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా జట్టు రెండవ స్థానం, పశ్చిమ గోదావరి జిల్లా జట్టు మూడో స్థానం దక్కించుకున్నారని ఆమె తెలిపారు. ఎంపికైన జట్లు డిసెంబరు 11 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్‌లోని లుధియానాలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సోమవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.విజయప్రసాద్‌రెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.చంద్రమోహన్ రాజు, టోర్నమెంట్ అబ్జర్వర్ విజయకుమార్ బుడుగుంటపల్లె సర్పంచ్ చంద్రశేఖర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రెడ్డి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగ్‌లో పురోగతి సాధించాలి

విద్యార్థులకు అపార్ ఐడీలు త్వరితగతిన జనరేట్ చేయాలి : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఇళ్ల జియో ట్యాగింగ్‌లో పురోగతి సాధించాలని, విద్యార్థులకు త్వరితగతిన జనరేట్ చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, ఆర్డీవోలు జిల్లా అధికారులు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో పీజీఆర్‌ఎస్, ఎన్టీఆర్ హౌసింగ్ జియో ట్యాగింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు గత వారంలో వెయ్యికి పైగా ఉండేవని వాటిల్లో దాదాపు 50 శాతంపైగా పరిష్కరించి మంచి పురోగతి సాధించారన్నారు. రెవెన్యూ శాఖను స్ఫూర్తిగా తీసుకుని మిగతా జిల్లా అధికారులందరూ వారి శాఖలకు సంబంధించిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీల పురోగతిపై వివిధ ప్రశ్నలు అడిగి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ ఇళ్లకు సంబంధించిన జియో ట్యాగింగ్ గురించి సమీక్షిస్తూ... హౌసింగ్‌శాఖ, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని పురోగతి సాధించాలన్నారు. విద్యార్థులకు మంజూరు చేసే అపార్ ఐడీలకు గురించి సమీక్షిస్తూ ఎంఈవోలు, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని జిల్లాలో ఈ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, డీఆర్వో మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి



రాష్ట్ర జట్టుకు ఎంపికైన జస్వంత్

గాలివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ జట్టుకు గాలివీడు విద్యార్థి చీకటి జస్వంత్ ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గాలివీడు మండలం కరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన వీఆర్‌ఏ కుమార్ కుమారుడు జస్వంత్ కడప చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులుగా విజయవాడలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇంటర్ చాంపియన్‌షిప్ వాలీబాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్య



మృతి చెందిన బోనం నవ్య

రాజంపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వివాహం ఇష్టం లేక ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఊటుకూరుకు చెందిన వెంకటసుబ్బమ్మకు ఇద్దరు ఆడపిల్లలు. కుటుంబ పోషణ కోసం ఆమె కువైత్‌కు వెళ్లింది. భర్త వెంకటసుబ్బయ్య ఈ మధ్యనే మృతి చెందాడు. పెద్ద కూతురుకు గతంలోనే వివాహం కాగా, చిన్నకూతురు నవ్య (24) చదువు పూర్తి కావడంతో వెంకటసుబ్బమ్మ కువైత్ నుంచి వచ్చి ఆమెకు వివాహం చేయాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో సోమవారం వెంకటసుబ్బమ్మ పెంచలకోనకు వెళ్లిన సమయంలో ఇంటిలో నవ్య ఉరి వేసుకుని మృతి చెందింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజంపేట మన్నూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీధర్

నిమ్మనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కె.శ్రీధర్‌కు సోమవారం విజయవాడ ఎస్-కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ చేతు మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు గురుపూజోత్సవంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం సంతోషంగా ఉందని, మరింత పట్టుదలతో శ్రమించి కళాశాలకు మంచి పేరు తెచ్చి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

మైనార్టీ శాఖ తరపున కరీముల్లాకు...



కరీముల్లాకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయుడు కేసీ కరీముల్లాఖాన్ మైనార్టీ, న్యాయశాఖామంత్రి ఎండీ ఫరూక్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో సోమవారం ఈ అవార్డు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి అవార్డుతో పాటు నగదు ప్రోత్సాహం ఇస్తోంది. ఇందులో భాగంగానే కరీముల్లాకు రూ.10 వేలు చెక్కు, జ్ఞాపిక, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యప్రసాద్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, వివిధ జిల్లాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు, భాషాభిమానులు పాల్గొన్నారు.


కంచే చేను మేస్తే...

● కురబలకోట రెవెన్యూలో భూబాగోతం
● డీకేటీ భూమిని భర్త పేరుతో మార్చేసిన రెవెన్యూ ఉద్యోగి



పిచ్చలవాండ్లపల్లె వద్ద సర్వే నెంబర్ 629 లోని భూమి

కురబలకోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమె రెవెన్యూ శాఖలో చిన్నపాటి ఉద్యోగి. రెవెన్యూకు సంబంధించిన శాఖలో పనిచేస్తుండటంతో తనను ఎవరు అడుగుతారు లే అనే ధైర్యమో లేక ఎవరికీ తెలియదనే నమ్మకమో ఏమో గానీ చక్కగా తన కార్యకలాపాలను చేసుకున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం వేరొకరి పేరుతో పట్టా మంజూరు చేసిన భూమిని గుట్టుచప్పుడు కాకుండా తన భర్త పేరు మీద వన్‌బీ హక్కును కల్పించారు. రెండెకరాలకు పైగా భూమిని కాజేయడమే కాకుండా తిరిగి భూయజమాని మీదకే గొడవకు వెళ్లారు.


గ్రామ-వార్డు సచివాలయ శాఖ
APGSWS AE 28424924
ఫారం -1 బి
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, రెవెన్యూశాఖ, భూమి రికార్డుల కంప్యూటరీకరణ
భూమి యజమాన్యపు హక్కుల రికార్డు ప్రకారము (1-బి) నమూనా (ROR)
Application No
Date :02/11/2024
Certified By

శంకర్ పేరుతో మంజూరు చేసిన వన్‌బీ అడంగల్

కురబలకోటలో రెవెన్యూ అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. ఫైసలిస్తే చేయకూడని అడ్డమైన పనులను గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం నిబంధనల మేరకు చట్టరీత్యా సాధ్యం కాదు. కానీ ఇక్కడ పని చేస్తున్న అధికారులకు ఆ పనులు చేయడం నిబంధనలకు విరుద్ధమని తెలిసిన ఏ మాత్రం లెక్కచేయకుండా డబ్బు ఆశతో అడ్డదిడ్డంగా పనులు చేశారు.

ఇలాంటి భూములకు భూమి హక్కును ఆన్‌లైన్ చేయడం ద్వారా కల్పించారు. పదుల సంఖ్యలో వివిధ గ్రామాల్లో భూములను ఇతరుల పేరుతో మార్పులు చేశారు. ఒకరి పేరు మీదన ఉన్న భూమిని వారికి తెలియకుండానే మరొకరి పేరున మార్చేశారు. ఈ విషయం బాధితులకు తెలిశాక అధికారుల దృష్టికి తీసుకెళ్ళిన సమస్యను ఇంతవరకు పరిష్కరించ లేదు. కాగా ప్రాంతం, విస్తీర్ణాన్ని బట్టి రూ.2లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డబ్బులు తీసుకున్నట్లు బహిరంగా ఆరోపణలు వినిపించడంతో పాటు పలువురు బహిరంగ ప్రదేశాల్లో చర్చించుకుంటున్నారు.

ఇంత తంతు జరిగినా తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 629లోని 2.34ఎకరాల భూమి 1995లో గ్రామానికి చెందిన కదిరప్ప పేరు మీదన పట్టాను మంజూరు చేశారు. అయితే ఈ భూమిని కాజేయాలని రెవెన్యూలో పని చిన్నస్థాయి అధికారి పథకం పన్ని తన భర్త శంకర పేరు మీదన వన్‌బీ హక్కు కల్పించారు. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు.

మాకు తెలియకుండానే పట్టా చేసుకున్నారు



మాకు తెలియకుండానే గ్రామ వీఆర్‌ఏ భర్త శంకర పేరు మీద పట్టా చేసుకున్నారు. మా నాన్నకు 1995లో పట్టా ఇచ్చారు. అయితే ఆయన వారసత్వంగా మాకు రావాలి. కానీ నన్ను మాటమాత్రమైన అడగకుండా వేరొకరి పేరున వన్‌బీ హక్కు కల్పించారు. అంతేకాకుండా మాపై వాళ్లు దాడులకు వస్తున్నారు. అధికారులు విచారించి మాకు న్యాయం చేయాలి.

- వెంకట్రాయప్ప, భూయజమాని

విచారించి న్యాయం చేస్తాం

ఈ భూములకు సంబంధించి గతంలో పాసుపుస్తకాలు మంజూరు చేశారు. దీనిపై గ్రామానికి చెందిన ఆయన మాకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటాము. ఇరువర్గాలను పిలిపించి విచారిస్తాము.

- తపస్విని, తహసీల్దార్



తేలనున్న పశువుల లెక్క

● వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన సర్వే ● నిధులు, పథకాల రూపకల్పనకు అవకాశం

జిల్లాలో పశువుల వివరాలు

20వ అఖిలభారత పశుగణన సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువుల వివరాలు ఇలా ఉన్నాయి. గేదెలు (నల్లజాతి పశువులు) 3,99,754, ఆవులు, ఎద్దులు 44 వేలు, మేకలు 3,80,099, గొర్రెలు 9,20,614, కోళ్లు 10 వేలు, పందులు 2,775 ఉన్నాయి.

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశుగణనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా జిల్లాలోని ప్రతి కుటుంబం, ఇంటింటికి చెందిన పశువుల వివరాలను ఇందులో నమోదు చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు పశుగణన ఉపయోగపడుతుంది. మార్గదర్శకాలను అనుసరించి ఫిబ్రవరి నెలాఖరు వరకు ఈప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గణకులు, పర్యవేక్షకులు ఇప్పటికే ఇంటింటి సర్వేలో భాగంగా పశువుల వివరాలను నమోదు చేస్తున్నారు. తొలుత సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించడానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఉత్తర్వులు జారీ చేయగా అనివార్య కారణాలతో అది వాయిదా పడింది. దీంతో అక్టోబరు 25 నుంచి గణను ప్రారంభమైంది.

పథకాల అమలుకు...

జిల్లాలో వ్యవసాయ రంగం తర్వాత పశుసంవర్ధక రంగం చాలా కీలకమైంది. రాష్ట్ర స్థూల నిష్పత్తిలో ఈశాఖ నుంచి 8 నుంచి 9 శాతం ఆదాయం వస్తుంది. జిల్లాలో పశుపోషణపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 1.80 లక్షలపాడి కలిగిన రైతులు ఉన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలకు కొత్తగా చేపట్టనున్న పశుగణన దోహదపడుతుంది. నాలుగు నెలలుగా పైగా చేపట్టనున్న ఈ గణనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ రూపొందించింది.

పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమైన నిధులు, పథకాల రూపకల్పన, అమలు పర్యవేక్షణకు ఈ గణన ఉపయోగపడుతుంది. గేదెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, గొర్రెలు, పందులు, ఇతర పెంపుడు జంతువులు అయిన కోళ్లు, పక్షులు, పావురాళ్ళ, చిలుకలు, గుర్రాలు, టర్కీ కోళ్లు తదితరవి కలిపి మొత్తం 16 రకాల గణన చేస్తున్నారు.



ఇంటింటి పశుగణన చేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది

726 రెవెన్యూ గ్రామాల్లో....

కడప జిల్లాలో 36 మండలాల్లో ఉన్న 726 రెవెన్యూ గ్రామాల్లోని 557 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి పశుగణన ప్రారంభించారు. ఇందులో 236 మంది ఎన్యుమరేటర్లు, 72 మంది సూపర్‌వైజర్లతోపాటు పశువర్ధక సహాయకులు, సిబ్బంది పాల్గొంటున్నారు. పశువైద్యాధికారులను పర్యవేక్షకులుగా నియమించారు. ఈ ప్రక్రియను జిల్లా అధికారులు, పర్యవేక్షకులు ఆయా వివరాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పశుగణనపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ మాట్లాడుతూ పశుగణనపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. ఆకస్మిక తనిఖీలు చేసి సెన్సెస్‌లు తీసే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలు నుంచి పశువులను కాపాడుటకు సూచనలు జారీ చేస్తున్నామన్నారు. అనుకున్న లక్ష్యానికి 15 రోజుల ముందే ఈ గణన ప్రక్రియ పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి : యూటీఎఫ్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేశ్‌బాబు కోరారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని దానిని తిరిగి పునర్నిర్మించే పని ఈప్రభుత్వం చేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి చాలా తక్కువ నిధులు కేటాయించడం తీవ్ర నిరాశపరిచిందన్నారు. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి నిధులు అధికంగా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ నాయకులు క్రిష్టారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర బడ్జెట్ ఉద్యోగులను నిరాశపరిచిందని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగు బకాయిలు చెల్లింపు విధానంపై బడ్జెట్‌లో చూపించలేక పోవడం జరిగిందన్నారు. పీఆర్సీ గడువు ముగిసి 16 నెలలు గడుస్తున్నా ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదిశాతం మేర పాఠశాల విద్యకు బడ్జెట్ కేటాయించడం సంతృప్తి నిచ్చిందన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించి న్యాయం చేయాలి

● జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

జాతీయ వ్యాధి నిరోధక టీకాలపై శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాలు మొదలు పెట్టిన సమయం నుంచి లబ్ధిదారులకు అందే వరకు సరైన ఉష్ణోగ్రత ఉండేట్లు చూడాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు ఇచ్చిన సమయంలో టీకాల వల్ల దుష్పరిణామాలు ఏమైనా వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రిపోర్టింగ్ విషయాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు ప్రాథమిక పట్టణ వైద్యాధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిపై అల్లరిమూక దాడి

వేంపల్లె, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డిపై అల్లరిమూక దాడికి తెగపడింది. నడి రోడ్డుపై ఘర్షణ పడటంతో దారిన వెళ్లే వారు బయాం దోళ నకు గురయ్యారు. ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ అక్కడికి చేరుకుని అల్లరి మూకను తరిమి కొట్టారు. గాయపడ్డ శ్రీకాంత్‌రెడ్డిని చికిత్స నిమిత్తం కడపకు పంపించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఈ సందర్భంగా ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నరసింహులు (ఫైల్‌ఫొటో)

దువ్వూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం జిల్లేళ్ల గ్రామ సమీపంలోని రెస్టహౌస్ దగ్గర ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి నరసింహులు (37) మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. దువ్వూరు నుంచి జిల్లేళ్లకు బైక్‌పై ముగ్గురు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం స్కూటర్‌ను వెనుకవైపు నుంచి వచ్చి ఢీకొంది. వెంటనే 108 వాహనంలో వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నరసింహులు మృతి చెందాడు. మృతుని బావ అరవిందకుమార్, తండ్రి నరసింహులు గాయపడగా వీరిని ఆస్పత్రిలో చేర్పించారు. దువ్వూరు పోలీసులు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పొలం విషయమై ఘర్షణ.. ఇద్దరికి గాయాలు



గాయపడ్డ రామసుబ్బమ్మ

లింగాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లెలో సోమవారం పొలం విషయమై జరిగిన ఘర్షణలో బోనాసి బాబు, బోనాసి రామసుబ్బమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ మధుసూదన్‌రావు వివరాల మేరకు.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం నేర్జాంపల్లె గ్రామ పొలంలో బోనాసి రామసుబ్బమ్మకు, బోనాసి సరస్వతమ్మకు భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ఆరేళ్లుగా ఇరు కుటుంబాలకు మనస్పర్థలు ఉన్నాయి. గత మేనెలలో రామసుబ్బమ్మ తన పొలంలో రెండువేల అరటిమొక్కలను నాటగా సరస్వతమ్మ అల్లుడు మన్నెల శ్రీనివాసులు సుమారు 1200 మొక్కలను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి సమస్య ముదురుతూ వచ్చింది. ఆ సమయంలో యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసులుపై కేసు కూడా నమోదు చేశారు. సోమవారం పార్నపల్లెలో బోనాసి బాబు తన కుమారుడిని స్కూల్‌కు తీసుకెళ్తుండగా అతనిపై మన్నెల శ్రీనివాసులు, మన్నెల కుమారి, మన్నెల సింధు దాడి చేశారు. బాబు తల్లి రామసుబ్బమ్మ అక్కడకు చేరుకోగా ఆమెపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు లింగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

మద్యం మత్తులో ఘర్షణ - కేసు నమోదు

మైలవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో మాట మాట పెరిగడంతో సోమవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మినారాయణ తెలిపారు. మండల పరిధిలోని మాధవాపురం గ్రామంలో ఆదివారం రాత్రి ఓబయ్య, కొండయ్యతోపాటు నాగమహేష్, నాగేంద్రప్రసాద్ మరో ఇద్దరు మద్యం మత్తులో మాట మాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సీఎం చంద్రబాబు ప్రభుత్వంపై ఓ వర్గానికి చెందిన వారు విమర్శించడంతో మరో వర్గం వారు ప్రభుత్వం బాగా చేస్తోందని వాగ్వాదానికి దిగా రు. మాట మాట పెరగడంతో మద్యం మత్తులో ఘర్షణ పడ్డారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మోడమీదపల్లికి చెందిన అఖిల(25) అనే వివాహిత నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. మోడమీదపల్లికి చెందిన అఖిలకు మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నాగకేశవతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. గత కొన్ని రోజుల నుంచి ఆరోగ్య సమస్యలతో మనోవేదనకు గురై శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. బంధువులు గమనించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమించి పెళ్లి చేసుకోకపోవడంతో..

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం గుండె అంజలి (25) అనే యువతి మృతి చెందినట్లు ఒన్‌టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సుండుపల్లెకు చెందిన అంజలి కడప నాగరాజుపేటలోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. అక్కడే పనిచేస్తున్న భానుప్రసాద్ చేస్తుండగా ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల పెళ్లి చేసుకోవాలని యువతి అడగడంతో భానుప్రసాద్ ఒప్పుకోలేదు. దీంతో మనస్థాపం చెంది ఈనెల 6వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

కడప(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసు స్టేష న్ పరిధిలో ఇరువురు విద్యార్థినులు అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశర్లు తెలిపారు. బాలజీనగర్‌కు చెందిన బాలిక, కాగితాలపెంటకు చెందిన బాలిక ప్రైవేట్ స్కూ ల్‌లో 8వ తరగతి చదువుతున్నారు. సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి ఎదురుగా ఉన్న షాపులో దోశ తినేందుకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అత్యంత కీలకం భూగర్భజల అధ్యయనం : వీసీ



మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ క్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూగర్భజల అధ్య యనానికి అత్యంత ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఉందని వైస్‌చా న్సలర్ కె.క్రిష్టారెడ్డి అన్నారు. సోమవారం వైవీయూలో భూగర్భ నీటి వనరుల సుస్థిరత, నిర్వహణపై మూడు రోజులు జరిగే శిక్షణ తరగ తులను వైస్‌చాన్సలర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ రాను రాను వర్షపాతం తగ్గుతుందని.. భూగర్భజలాలు అడు గంటుతాయని.. ఇప్పుడు ఆలోచించకపోతే భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. భూగర్భజల అధ్యయనం క్లౌడ్ కంప్యూ టింగ్ వంటి కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయని గుర్తు చేశా రు. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజనల్ డైరెక్టరు క్రిష్ణమూర్తి మాట్లాడుతూ రాయలసీమలో భూగర్భ జల సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాము ఇవ్వబోయే శిక్షణ ద్వారా భూమిలో ఖనిజ లవణాల గురించి నేటితరం అవగాహన పొందుతుందన్నారు. తద్వారా భూమిలో నిల్వలు ఎంత ప్రయోజనకరమైనవో తెలుస్తుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథ రెడ్డిలు మాట్లాడుతూ కరువుప్రాంతాల్లో భూగర్భజలాలు పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎర్త్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసరు శివప్రతాప్, జియాలజీ విభాగాధిపతి రవిబాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే నవసమాజ నిర్మాణం



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కడప(వినాయకనగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే చైతన్యంతో పాటు నవసమాజ నిర్మాణం జరుగుతుందని కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్ తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో సీఐడీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణపై చైతన్య సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకున్నపుడే న్యాయం జరుగుతుందన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రశ్నించే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. మున్సిపల్ అదనపు కమిషనర్ రాకేశ్‌చంద్రం మాట్లాడుతూ సమానత్వం, కులవివక్ష నిర్మూలించడానికి ప్రవేశపెట్టిన సివిల్‌రైట్స్ యాక్ట్ ప్రకారం వివక్ష తగ్గిందన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలాజీ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, నియమ నిబంధనల గురించి తెలిపారు. సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ వివేకానంద మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు, మార్గదర్శకాలు రుణాల గురించి తెలిపారు. కార్యక్రమంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, దిశా పోలీస్‌స్టేషన్ సీఐ క్రిష్టారెడ్డి, సీఐడీ అధికారులు బాబాఫకృద్దీన్, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంత మంది విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు.

విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలు

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థలు విభిన్న ప్రతిభావంతులకు చట్టపరమైన సేవలను అందిస్తాయని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్ తెలిపారు. కడప నగరం రామాంజనేయపురంలోని హెలెన్ కెల్లర్ ప్రత్యేకపాఠశాల, జూనియర్ కళాశాలలో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశపెట్టిన బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం, మానసిక వికలాంగులకు చట్టపరమైన సేవల పథకం, విభిన్న ప్రతిభావంతుల పిల్లల కోసం న్యాయసేవల పథకం, లీగల్ సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబర్ 15100పై వివరించారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుల డిపార్ట్‌మెంట్ అధికారులు, వైద్యశాఖ అధికారులు సంయుక్తంగా మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్యాధికారుల చేత ఆడియో మెట్రేషన్ టెస్టులు నిర్వహిం చి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం జడ్జి బాబా పక్రుద్దీన్ 10 మంది పిల్లలకు హియరింగ్ మిషన్స్‌ను అందజేశారు. సోమవారం పురుషుల, మహిళల కేంద్ర కారాగారాలను జడ్జి విజిట్‌చేసి న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాలలో ట్రైనీ జడ్జిలు జె.నందిని, ఖాజామొహిద్దీన్, ఎం.అనిల్‌కుమార్ నాయక్, ఎం.ఆశాప్రియా, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



ఏసీఏ మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ నవంబర్ 11, (ఆంధ్రజ్యోతి) : కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్ రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా వివిధ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లు సోమవారం డ్రాగా ముగిశాయి. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు-విజయనగరం జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన విజయనగరం జట్టు 80.3 ఓవర్లలో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 250 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ రోజు 84 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 10 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం మైదానంలో అనంతపురం-క్రిష్ణా జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 322 పరుగులు భారీ స్కోర్ సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన క్రిష్ణా జట్టు 63.4 ఓవర్లలో 247 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేఎస్ఆర్ఎం మైదానంలో శ్రీకాకుళం-గుంటూరు జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. తదుపరి శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 53.3 ఓవర్లలో కేవలం 139 పరుగులకే చేతులెత్తేసింది. రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

దేశసేవ లక్ష్యంగా పరుగు

● రెండోరోజు కొనసాగిన ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ



అభ్యర్థులకు సూచనలు ఇస్తున్న ఆర్మీ అధికారి



అభ్యర్థులకు లాంగ్ జంప్ నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

కడప స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ మైదానంలో అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ రెండోరోజు సోమవారం కొనసాగింది. జన్మనిచ్చిన మాతృదేశానికి సైనికులుగా సేవలందించాలనే లక్ష్యంతో ఆర్మీ రిక్రూట్‌మెంటుకు వచ్చిన యువకులు రెట్టించిన ఉత్సాహంతో పరుగుపందెంలో పాల్గొన్నారు. ఆ మేరకు రెండోరోజు పరుగుపందెంతో పాటు జిగ్ జాగ్ బ్యాలెన్స్, పుల్లప్స్, హైజంప్, లాంగ్‌జంప్ తదితర పోటీలను ఆర్మీ అధికారులు నిర్వహించారు. ఇందులో క్వాలిఫై అయిన వారికి ఆ వెంటనే మెడికల్ టెస్ట్ నిర్వహించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్‌ఆధ్వర్యంలో ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. రోజువారీగా 800 మంది అభ్యర్థులను టెస్టులకు సిద్ధం చేస్తున్నారు. ఆకోవలో సోమవారం కర్నూలు, చిత్తూరు జిల్లాకు చెందిన అభ్యర్థులకు పోటీలు నిర్వహించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

మార్మోగిన శివనామస్మరణ

● పొలతలకు పోటెత్తిన భక్తులు
● ఘనంగా స్వామి, అమ్మవార్ల ఊరేగింపు





కడప నగరం మృత్యుంజయకుంట శివాలయంలో ప్రత్యేక అలంకారంలో శివయ్య... కిటకిటలాడుతున్న భక్తులు



పెండ్లిమర్రి: పొలతలలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

పెండ్లిమర్రి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పొలతల క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. రెండవ కార్తీక సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా చేరుకున్నారు. పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ వద్ద ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.కృష్ణానాయక్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు రాజారెడ్డి, బాలరాజారెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ చంద్రశేఖర్, ఆలయపూజారులు,ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కమలాపురంలోని చదిపిరాళ్ల శివాలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శివాలయాల్లో పూజలు

వేంపల్లెలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతపేటలోని భవాని నీలకంఠేశ్వర ఆలయం, పాపాఘ్ని నదీఒడ్డున ఉన్న దుర్గాదేవి గవిమల్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి తన సొంత ఖర్చుతో అంధకారంగా ఉన్న గవిమల్లేశ్వరాలయం వద్ద లైటింగ్ ఏర్పాటు చేయించారు.



చెన్నూరు కొత్త గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం వెనుక పెద్ద గురుగునీటి గుంత ఉంది. అందులో ఎప్పుడూ పందులు పొర్లాడుతుంటాయి.. దోమలు విపరీతంగా పెరిగాయి. దీంతో అంగన్వాడీకి వచ్చే చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఎంతో కాలంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని చిన్నారుల తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. -చెన్నూరు, (ఆంధ్రజ్యోతి)

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

కడప నాగరాజుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏసీడీపీఓ శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు దీపా, నాగరత్న పేర్కొన్నారు. సోమవారం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కిశోరి వికాస కార్యక్రమం సాయిపేట పాఠశాలలో నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్యవివాహాలపై వివరించారు. సాయిపేట సచివాలయ మహిళా పోలీసు రాజేశ్వరి, స్కూలు సిబ్బంది చలపతి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

● డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి



నిరసనలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు చార్జీల పేరుతో పెరిగిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడపలోని పార్టీ కార్యాలయం నుంచి మహవీర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. వైసీపీ హయాంలో రూ.35వేల కోట్లు సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజల నుంచి వసూలు చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ఐదు నెలల్లోనే రూ.17వేల కోట్ల భారం మోపుతోందన్నారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో యూనిట్ ధర రూ.4.80పైసలు ఉంటే ఏపీలో మాత్రం రూ.6 వసూలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఏకంగా సర్దుబాటు చార్జీల పేరుతో 40 శాతం అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పులివెందుల నియోజకవర్గం సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి, ప్రొద్దుటూరు నియోజకవర్గం సమన్వయకర్త ఇర్ఫాన్‌బాషా, జమ్మలమడుగు నియోజకవర్గ సమన్వయకర్త శివమోహన్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలీ ఖాన్, పీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు బండి జకరయ్య మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో కాగ్రెస్ పార్టీ నాయకులు సలాఉద్దీన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుశీల్‌కుమార్, గౌస్‌పీర్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ప్రైవేటు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నేతలు

కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక ప్రైవేటు ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామాంజనేయులు, లింగన్న మాట్లాడారు. ఉచిత ఇసుక నిర్ణయం అభాసుపాలు కాకుండా మధ్య దళారీ వ్యవస్థ ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టడం మానుకోవాలని, నిర్మాణ రంగ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సిమెంటు, ఐరన్, కలప నిర్మాణ సామగ్రి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, చాంద్ బాషా, నాగన్నగౌడ్, కార్మిక సంఘం నాయకులు ఏసోబు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు సేవలను వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ ఆఫీసరు కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఆర్థిక సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టర్మ్ డిపాజిట్లపై తమ బ్యాంకు అధికఎ వడ్డీ అందిస్తుందన్నారు. రూపే కార్డు సదుపాయం కూడా ఉందని, ఈ కార్డు ద్వారా లక్ష రూపాయల నుంచి రూ.2లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉందన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పింఛన్ యోజన వంటి పథకాలు ఉన్నాయన్నారు.

శిక్షణను యువత వినియోగించుకోవాలి



శిక్షణలో మాట్లాడుతున్న వీరయ్య

సీకేదిన్నె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య తెలిపారు. స్థానిక ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం నందు సోమవారం ఎస్సీ ఉపప్రణాళిక కింద మాంసాధారిత ఆహార ఉత్పత్తుల తయారీపై సోమవారం యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నారు. పశువిజ్ఞాన శాస్త్రవేత్త సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మాంసం, పాలతో విలువ జోడింపు పదార్థాలు తయారీపై యువత దృష్టి పెట్టాలని తద్వారా మంచి పోషకాహారం అందించడంతోపాటు ఉపాధిని మెరుగుపరచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దిలీప్ గుప్త, విలువ జోడింపు పద్ధతులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రశాంతి, పాల్గొన్నారు.

నాటుసారా, అక్రమ మద్యం నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంటు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాటుసారా, అక్రమ మద్యం పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంటు కమిషనర్ చంద్రశేకర్ రెడ్డి అన్నారు. సోమవారం పులివెందుల పట్టణంలోని నగరిగుట్టలో 'సారాలేని గ్రామాలు ప్రగతికి మార్గాలు' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందులను నాటుసారా రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యాన్ని పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు ప్రజల సహకారం కావాలన్నారు. నాటుసారా తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. నాటుసారా తయారు చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. నాటుసారా వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని అన్నారు. అంతేకాక తాగే వారి ఆరోగ్యాలు క్షీణించడం వల్ల సారాకు బానిస అయి కుటుంబాలు రోడ్డుపాలవుతున్నారన్నారు. ఎమ్మార్వో నజీర్‌అహ్మద్, పులివెందుల టౌన్ ఎస్ఐ విషణనారాయణ, ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ సాదిక్ అహ్మద్, సిబ్బంది మల్లిఖార్జున, ఆంజనేయులు, ప్రసాద్, పాల్గొన్నారు.

డయాలసిస్‌కు 108 వాహనాన్ని ఉపయోగించాలి

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ బాధితులు ఎక్కువగా ఉన్నారని 108 వాహనం ద్వారా వారికి రవాణా వాహనాన్ని ఉపయోగించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వేంపల్లె ఆసుపత్రిని ఆయన సోమవారం సందర్శించారు. డయాలసిస్ పేషంట్లకు 108 వాహనాన్ని ఎందుకు పంపడం లేదని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు పంపవద్దని చెప్పారనడంతో హరిప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. డయాలసిస్ రోగులకు పింఛన్ ఇస్తున్నారని, వేంపల్లె నుంచి ఇటు పులివెందుల, అటు కడపకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ప్రత్యేక వాహనం డయాలసిస్ రోగులకు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు.

'అసత్య ప్రచారంతో మహిళా భద్రతకు ప్రమాదం'

కడప (క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసత్య ప్రచారంతో మహిళా భద్రతకు ప్రమాదమని ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు భూమిరెడ్డి విజయభారతి అన్నారు. స్వయంశక్తితో ఎదుగుతున్న మహిళలపై అసత్య పోస్టింగులు పెడుతున్న వేంపల్లెకు చెందిన చిన్నదస్తగిరి రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనపై, తన కళాశాలపైన తప్పుడు ప్రచారాన్ని ఒప్పుకుని బహిరంగ క్షమాపణలు కోరాలన్నారు.

సమతుల్య ఆహారంపై అవగాహన

పులివెందుల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల దత్తత గ్రామమైన మున్సిపల్ పరిధిలోని బ్రాహ్మణపల్లెలో సోమవారం అధ్యాపకులు సమతుల్య ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. రోజువారీ జీవితంలో సమతుల్య ఆహారానికి ప్రాముఖ్యతనివ్వాలని సూచించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కీర్తిరెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయ శ్రీనివాస్, డాక్టర్ జాకీర్ బాష, కళాశాల విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ భూముల సాధనే లక్ష్యం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య



కడప ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేదలకు భూముల సాధనే లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు సాగు భూమి, ఇంటి స్థలాలు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముట్టడిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పాలక ప్రభుత్వాలు అర్హులైన వారికి రెండు ఎకరాల సాగు భూమి, ఇంటి స్థలం, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఓట్లు పొంది అధికారంలోకి రాగానే విస్మరించడం బాధాకరమన్నారు. వైసీపీ పాలనలో ఆరు విడతల భూ పంపిణీలో కూడా భూమి దక్కని వారు చాలా మంది ఉన్నారన్నారు. అసైన్‌మెంటు కమిటీ నిర్వహించి అర్హులైన పేదలకు భూ పంపిణీ చేపట్టకపోవడం విచారకరమన్నారు. అనంతరం కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్‌కు పేదలు తీసుకువచ్చిన దరఖాస్తులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏపీ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ నాయక్, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, కమలాపురం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్, అధ్యక్షుడు బ్రహ్మం, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెయ్య, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలి

సీకేదిన్నె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలంలోని ఊటుకూరు పొలంలో జరిగిన భూ ఆక్రమణలపై విచారణ జరిపించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, తహసీల్దారు నాగేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్దిరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి మగ్బుల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా మంగళగౌరీదేవి కార్తీక మహోత్సవాలు



వేంపల్లెలో పూజలు చేస్తున్న భక్తులు

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె సంగం వీధిలోని మంగళగౌరీ దేవి ఆలయంలో కార్తీక మహోత్సవ వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి ప్రసాదరావు ఆధ్వర్యంలో పసుపుముద్దతో మంగళగౌరీదేవి ప్రతిమను తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

చెన్నూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఓఆర్ కాలనీలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ అనాథ శవానికి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మానవతా సంస్థ మాజీ అధ్యక్షుడు జీఎన్‌భాస్కర్‌రెడ్డి, సంస్థ కార్యదర్శి ఆటోబాబు, అతికారి కిశోర్, రామిరెడ్డి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనాథ శవాన్ని పెన్నానది వరకు తీసుకెళ్లి అక్కడ అంత్యక్రియలు పూర్తి చేశారు.

సంక్షిప్తం

ఉరుసుకు హాజరుకావాలని కలెక్టర్‌కు ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని అమీన్‌పీర్ ఉరుసుకు హాజరుకావాలని కలెక్టరు చెరుకూరి శ్రీధర్‌కు మత పెద్దలు ఆహ్వానపత్రికను అందించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరు చాంబరులో అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి, మత పెద్దలు కలెక్టరును కలిసి ఆహ్వానపత్రికను అందించారు.

బాలికలు అప్రమత్తంగా ఉండాలి

వల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, పార్వతి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికల చట్టాలు, బాల్యవివాహాల రద్దు గురించి అవగాహన కల్పించారు.

అవినీతిపై చర్యలు తీసుకోండి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 3వ డివిజను కేంద్ర కారాగారం పక్కన నిర్మించిన హిందూ ముస్లిం క్రిస్టియన్ శ్మశాన వాటిక నిర్మాణంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని 3వ డివిజన్ టీడీపీ నాయకులు మల్లిఖార్జున, సుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో జరిగిన గ్రీవెన్ సెల్‌లో కమిషనరుకు వారు వినతిపత్రం అందించారు. దాదాపు రూ.4కోట్లు విలువైన ఈ పనుల్లో అక్రమాలు జరిగాయన్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

వేంపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికేట్ అవసరమని, ఆధార్‌లో తప్పుల వల్ల నమోదు చేయలేక పోతున్నాం, ప్రత్యేకంగా పాఠశాలల్లో కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఓబుళమ్మకు హెచ్‌ఎం శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కమలాపురం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామసభలో వచ్చిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దారు శివరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ అహల్య, రీసర్వే డీటీ శ్రీకాంత్, వీఆర్వో సచివాలయ సర్వేలు పాల్గొన్నారు.

'భవానీ మాతా.. నమోస్తుతే...'

వల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'భవానీ మాతా.. నమోస్తుతే..' అంటూ భక్తులు అమ్మవారిని పూజించారు. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా మండల కేంద్రమైన వల్లూరులోని శివాలయంలో తెల్లవారుజాము నుంచే భవానీ శంకరులకు రుద్రాభిషేకాలు పంచాయతీ మృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అలాగే భవానీ అమ్మవారిని వివిధ కూరగాయలతో శాకాంబరి దేవిగా అలంకరించారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించండి

కడప కల్చరల్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): అర్చకుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పురోహిత, బ్రాహ్మణ సమాఖ్య వ్యవస్థాపకుడు యామిజాల నరసింహమూర్తి కోరారు. సోమవారం సమాఖ్య అధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలలో ధూపదీప నైవేద్యం కింద గతంలో ప్రతినెలా రూ. 5 వేలు పొందే అర్చకులకు ఆ మొత్తాన్ని 15 వేలకు పెంచేలా కూటమి ప్రభుత్వం చొరవ చూపడం సంతోషకరమన్నారు.సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళీశర్మ, జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ, కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్

● వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్‌చాన్సలర్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదర్శప్రాయుడు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ అని వక్తలు కొనియాడారు. సోమవారం మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతిని ఉర్దూ శాఖ విభాగాధిపతి రియాజున్నీసా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యామంత్రిగా మౌలానా అబుల్‌కలాం ఆజాద్ దేశ విద్యావ్యవస్థను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సామాజిక సంస్కరణల కోసం విద్యామంత్రిగా యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు, ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి అందరికీ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారన్నారు. అనంతరం రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నకు చేయూత అందించండి

కడప కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేతన్నకు చేయూతనందించాలని కళాభారతి చేనే హస్తకళా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెల్ల సత్యనారాయణ కోరారు. కళాభారతి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక నేక్‌నామ్ కళాక్షేత్రంలో చేనేత హస్తకళా మేళా కార్యక్రమానికి హాజరై అమ్మకాలను ప్రారంభించి మాట్లాడారు. నేటి నుంచి డిసెంబర్ 1 వరకు అమ్మకాలు చేపడతామన్నారు పాలక ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి నేతన్న బతుకులు మెరుగుపడేలా చూడాలని కోరారు. మేళాలో పోచంపల్లి బెడ్‌షీట్స్, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, మంగళగిరి చీరలు, వరంగల్ టవల్స్, లుంగీలు, గద్వాల్ చీరలు, జైపూర్ బెట్‌షీట్స్, టాప్స్, స్కర్ట్స్, బెంగాళీ కాటన్ చీరలు, లక్నో చికన్ వర్క్స్, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ మంచి ముత్యాలు, లెదర్‌బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగులు, గృహాలంకరణ వస్తువులు ఉన్నాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కడప(క్రైం),నవంబరు11(ఆంధ్రజ్యోతి): కడప నగరం రింగు రోడ్డులోని దేవునికడప ఆర్చీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కడప ఆటోనగర్‌కు చెందిన సాదక్ ఆలీ సొంత పని నిత్తం చెన్నూరుకు బైకుపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కింద పడి గాయపడినట్లు తెలిపారు. రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కొండలో పశువుల మేత కోసం స్థలాన్ని వదలాలి


జమ్మలమడుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం వద్దిరాల గ్రామం దొడియం కొండలో కొంత స్థలాన్ని గొర్రెలు, పశువుల మేత కొరకు వదిలిపెట్టి మిగిలిన స్థలంలో సోలార్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవాలని ఆదిశగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందజేశారు. జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మైలవరం మండలంలోని వద్దిరాల గ్రామానికి చెందిన కొందరు గొర్రెలు, పశువుల కాపరులు గొర్రెలు, పశువుల పోషణే తమకు జీవనాధారం అని, వాటిని మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని పలువురు తెలిపారు. దొడియం గ్రామాల మధ్యలో ఉన్న కొండలో తమ పశువుల మేత స్థలం ఉందని, అక్కడ సోలార్ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ కొండ 3,300 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. మూడు వేల ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు నిర్మించుకుని కొండ దిగువన ఉన్న 300 ఎకరాలు మాత్రం పశువులు, గొర్రెల మేత కోసం వదిలిపెట్టాలని కోరారు. ఈ మేరకు ఆర్డీవో సాయిశ్రీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గంగరాజు, సురేంద్ర, కిట్టయ్య, పెద్దదస్తగిరి, మల్లికార్జున పాల్గొన్నారు.

బి.కోడూరులో విచ్చలవిడిగా బెల్టుషాపులు

బి.కోడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలో బెల్టుషాపులపై ఆదివారం రాత్రి 10గంటలకు బి.కోడూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో మేకవారిపల్లె గ్రామానికి చెందిన సిద్దు నారాయణరెడ్డి బెల్టుదుకాణం నిర్వహిస్తున్నారని దాడి చేయగా వంద మద్యం సీసాలు పట్టుకున్నారు. వారిపై సోమవారం కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఆయన తెలిపారు. బి.కోడూరు మండలం మద్యం దుకాణం దక్కించుకున్న గుత్తేదారు ప్రతి గ్రామంలో బెల్టు దుకాణం ఏర్పాటుకు రూ.50వేలు వారి వద్ద అడ్వాన్సుగా తీసుకుని మండలం మొత్తంమీద అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం సరఫరాచేస్తున్నారు.







ఆశాజనకంగా కంది

ఆనందంలో రైతాంగం

రాజుపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పప్పుధాన్యాల్లో పోషకాల గనిగా పేరున్న కందిపంట సాగు ఈ సారి ఆశాజనకంగా ఉంది. డిసెంబరు చివరి వారంలో చేతికందే పంటల్లో ఇది ఒకటి. భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని పంటలు దెబ్బతిన్నా కంది మాత్రం మంచి దిగుబడి నిచ్చే దిశగా ఏపుగా పెరిగింది. ఈ సంవత్సరం మార్కెట్లో కందికి మంచి రేటు ఉండడంతో రైతన్నలు ఎక్కువ సాగు చేశారు. మండలంలో దాదాపు 200 ఎకరాలు పైబడి ఉన్నట్లు తెలుస్తోంది.

అనుకూలించిన వర్షాలు..: సాగులో ఉన్న కందిపంటకు వర్షాలు అనుకూలించాయి. ఏటా సెప్టెంబరు, అక్టోబరు వర్షాభావ పరిస్థితుల కారణంగా అంత ఏపుగా పెరగకపోవడంతో పాటు దిగుబడి తక్కువగా వచ్చేది .ఈ సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడి పంట ఏపుగా పెరగడంతో పాటు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలుకుతుండడంతో కంది రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా తక్కువ పెట్టుబడితో మంచి లాభాల దిశగా కందిపంట ఆశాజనకంగా ఉంది.


ఏపుగా పెరిగిన కంది

భక్తులతో శివాలయాలు కిటకిట

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని రెండో సోమవారం పట్టణంలోని శివాలయాలు భక్తుల రాకతో సందడిగా మారాయి. శివాలయంలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శివలింగానికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం, సాయంత్రం భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామ చంద్రుడు ప్రతిష్ఠించిన సైకత లింగానికిప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. హనుమత్‌లింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. పెన్నాతీరంలోని అమృతేశ్వరస్వామి ఆలయంలో మరకతలింగానికి, నవరత్న లింగానికి, జలలింగానికి, ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలకు ప్రత్యేక పూజలు చేశారు.

బద్వేలుటౌన్..: సోమవారం పట్టణంలోని పలు శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. శివాలయం ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కాశీ విశ్వేశ్వర ఆయలంలో స్ఫటికరూపంలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు.

పోరుమామిళ్ల..: సోమవారం బాలత్రిపుర సుందరీదేవి, రామలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున,రాత్రి కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయం చుట్టూ విద్యుద్దీపాలను అలంకరింప జేశారు.

ఖాజీపేట..: కార్తీక రెండో సోమవారం పురస్కరించుకుని ఉదయం నుంచి నాగేశ్వరుడి కోనలో ప్రతి మెట్టుకు పసుపు కుంకుమ పూసి కర్పూరం వెలిగిస్తూ, స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. కాగా బండలాగుడు పోటీలు అలరించాయి. గెలుపొందిన ఎద్దులకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే భక్తులకు కొత్తపేటకు చెందిన పోకల వెంకటసుబ్బారెడ్డి, ఆర్యవైశ్యులు, వాకింగ్‌బ్యాచ్, కాసిరెడ్డినాయన ఆశ్రమంలో భారీగా అన్నదానం నిర్వహించారు.


ప్రొద్దుటూరు శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

● **కనిపించని ఎండోమెంటు అధికారులు**

భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు ఏర్పాటు చేయక పోగా కార్తీకమాసంలోవచ్చి హుండీ ఏర్పాటు చేశాం, డబ్బులు తీసుకుని పోతాం అన్న చందంగా ఎండోమెంటు అధికారులు వ్యవహరించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చాపాడు..: మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో రెండో సోమవారం భక్తిశ్రద్ధలతో భక్తులు కార్తీకమాసోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరభద్రస్వామిని, శివున్ని, అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించారు. శ్రీరాములపేట మహిళలు చేసిన కోలాటం భక్తులను బాగా ఆకట్టుకుంది. సర్వమత అన్నదాన సత్రంలో, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో దేవస్థానం తరుపున భక్తులకు అన్నదానం చేశారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలో గోపవరం, దొరసానిపల్లె పంచాయతీ పరిధులలో తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. సోమవారం మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ఆధ్వర్యంలో గోపవరం పంచాయతీలోని ఇందిరానగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మణ్, ఓబులేసు, సూరి, సుధాకర్‌యాదవ్, మోహన్‌రెడ్డి, శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు. దొరసానిపల్లె పార్టీ ఇన్‌చార్జి మాడెం సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదును చేయించారు. నాయకులు రుషేంద్రరెడ్డి, వెంకాల సుధాకర్‌రెడ్డి, శ్రీపాల ప్రసాద్, వరదా సుధాకర్, శివ, నరాల భాస్కర్‌రెడ్డి, పాణ్యం సురేంద్ర, తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని కమలకూరు, మన్యంవారిపల్లె, మాడపూరు, కామసముద్రం, వేములూరు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు సోమవారం ముమ్మరంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు మంచూరి సూర్యనారాయణరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి,ఎంపీపీ పొత్తపి రమాదేవి, పోతిరెడ్డిరెడ్డయ్య ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీనాక్షిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్.రామక్రిష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహులు, రామసుబ్బారెడ్డి, పుల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం ప్రారంభం

పోరుమామిళ్ల, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచు కుని పోరు మామిళ్లలో కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను సకాలంలో మరమ్మతుల కోసం కేంద్రం ప్రారంభించినట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బీజేపీ నేత బొజ్జ రోశన్న అన్నారు. సోమవారం పోరుమామిళ్లలో విద్యుత్ కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రా న్ని వారితో పాటు ఎస్‌ఈ రమణ ప్రారంభించారు. ఈకేంద్రం నిర్వహణ టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి టెండర్లు దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, విద్యుత్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్లను సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, శ్రీను, చెన్నారెడ్డి, విజయకుమార్, ముంతాజ్‌బేగం, వెంకటసుబ్బమ్మ, మహేంద్ర, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందిస్తాం

ఎడిఫై పాఠశాల కరస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎడిఫై పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తామని ఆ పాఠశాల కరస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఆదిత్యారాం కాంప్లెక్స్‌లో ఎడిఫై పాఠశాల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడిఫై పాఠశాలకు దేశవ్యాప్తంగా 250 బ్రాంచ్‌లు ఉన్నాయని, పాఠ్యప్రణాళిక అద్భుతంగా ఉంటుందన్నారు. ఎక్కడా రాజీలేని విధంగా ఉత్తమ ప్రమాణాలతో పాఠశాలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికే ఎడిఫై పాఠశాలను ప్రొద్దుటూరులో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉన్నత ప్రమాణాలతో కూడిన పాఠశాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఏకే అగర్వాల్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడానికి పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుదేవ్ రామిరెడ్డి, మదనపల్లి ఎడిఫై పాఠశాల కరస్పాండెంట్ రమేష్, ప్రైవేటు విద్యాసంస్థల కరస్పాండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగలు తగిలి బాలుడికి గాయాలు

జమ్మలమడుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామంలో ఆదివారం కె.నాగచైతన్య (11) అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గ్రామంలోని శివార్లలో గేదెలను తోలుకుని వెళ్లాడు. అక్కడ చెట్టు వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ప్రమాదవశాత్తు విద్యార్థి చెట్టువద్దకు వెళ్లగానే విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు. ఆస్పత్రిలో ఐయూసీలో చికిత్స పొందుతున్నాడు.

ప్రభుత్వభూములు పేదలకు పంపిణీ చేయాలి

అట్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లాయపల్లె, తంబళ్లగొంది గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేయాలని సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు శిరీషాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వ్యవసాయ సంఘం నాయకుడు రమణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని పాత ఆటోనగర్ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పాత ఆటోనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని కేవీఆర్ ఆస్పత్రి, నజీర్ కంటి ఆస్పత్రికి చెందిన వైద్యులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. వైద్య పరీక్షలు అనంతరం కార్మికులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ లీగల్ అడ్వైజర్ సుదర్శన్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అధిక వసూళ్లుచేస్తే చర్యలు తప్పవు

ఖాజీపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆధార్ సెంటర్‌లో అధికంగా డబ్బులు తీసుకున్నట్లు మరోమారు ఫిర్యాదు వస్తే సీజ్ చేస్తామని ఆర్డీవో జాన్‌ఇర్విన్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పుల్లూరు, ఖాజీపేట ఆధార్‌సెంటర్లపై ఫిర్యాదు రావడంతో ఆమేరకు ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం డబ్బులు తీసుకోవాలని, వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు త్వరితగతిన పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ రికార్డులు తప్పనిసరిగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్‌బాష, సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన, నవంబరు(ఆంధ్రజ్యోతి)11: కాశినాయన మండల సర్వసభ్యసమావేశం ఈనెల 13వ తేదీన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మైథిలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న ఈసమావేశానికి ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

రైతులకు విరివిగా రుణాలు

ఏపీజీబీ మేనేజర్ మల్లికార్జుననాయుడు

చాపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల రైతులకు విరివిగా రుణాలు ఇస్తున్నట్లు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జుననాయుడు తెలిపారు. చియ్యపాడు గ్రామంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్‌లో కూడా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల చదువులకు, ఇతర వృత్తి పనుల వారికి, డ్వాక్రా మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ క్రిష్ణప్రియ, క్యాషియర్ భార్గవి, సిబ్బంది నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్లీ పోలీసింగ్‌తోనే ప్రజలకు చేరువ

బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్

పలకరింపు



బద్వేలుటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోలీసులంటే భయంకాదు, ప్రజల రక్షణకోసం పనిచేసే ఉద్యోగమని వారితో మమేకమైతే ఫ్రెండ్లీ పోలీసు విధానంతో నేరనియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామని బద్వేలు అర్బన్ సీఐ రాజగోపాల్ ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: బద్వేలులో ట్రాఫిక్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు: బద్వేలులో ట్రాఫిక్ సూచనలపై ప్రత్యేక దృష్టి సారించాం. నాలుగురోడ్ల కూడలిలో ముగ్గురుపోలీసులను అక్కడ ఉంచి, ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఉన్న సమయాల్లో సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం.

ప్రశ్న: శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం, ఆకతాయిలు మద్యం బాబులు గొడవపడితే వెంటనే వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్‌చేసి తహసీల్దార్ వద్దకు పంపించి వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: బహిరంగమద్యపానంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. ?

జవాబు : బహిరంగంగా మద్యం తాగడం చట్టవిరుద్ధం. దీనిపై ప్రజలకు అవగాహన పెంచుతున్నాం. రాత్రి పూట పెట్రోలింగ్ నిర్వహించి బహిరంగంగా మద్యం తాగేవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. అలాగే ఎప్పటికప్పుడు బహిరంగప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, ప్రధాన రహదారుల్లో మద్యం తాగి వాహనాలను నడిపేవారిపై కేసులు నమోదు చేస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా ?

జవాబు : వార్డుల్లో, గ్రామాల్లో పోలీసుల సహాయంపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. అనంతరం కోర్టు ద్వారా ఎటువంటి శిక్షలు పడతాయన్నవాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: మద్యం దుకాణాలు, బార్లు సమయపాలనను పాటిస్తున్నాయా?

జవాబు : ప్రభుత్వ నిబంధనల మేరకు బార్లు, మద్యం షాపులు సమయపాలనను పాటించాలి, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. అలాగే బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే షాపులపై కేసులు నమోదు చేసి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి లైసెన్స్‌లు రద్దు చేస్తాం.

ప్రశ్న: ఇసుక, మట్టి దందాపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, గ్రావెల్ తరలిస్తే కేసులు నమోదు చేస్తాం, ఇప్పటికే అక్రమంగా గ్రావెల్, ఇసుకను తరలించేవారిపై పలు కేసులు పెట్టాం.

ప్రశ్న: అర్బన్ పరిధిలో ఎంతమంది రౌడీ షీటర్లు ఉన్నారు ?

జవాబు : మా పరిధిలో 40మంది సస్పెట్లు, 12 మంది రౌడీషీటర్లు ఉన్నారు.

ప్రశ్న: చోరీల నియంత్రణపై దృష్టిసారించారా ?

జవాబు : వార్డుల్లో గ్రామాల్లో చోరీలపై గట్టినిఘా పెట్టాం. పాత నేరస్థుల కేసుల దర్యాప్తు వేగవంతం చేశాం.

ప్రశ్న: రాత్రిళ్లు గస్తీ ఎలా ఉంది ?

జవాబు : రాత్రిళ్లు పోలీసులతో గస్తీలు, ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాం.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టిసారించారా ?

జవాబు : ప్రస్తుతం ట్రాఫిక్ రద్దీగా ఉన్న ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రద్దీని నియంత్రిస్తున్నాం. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.